సాక్షి నిర్మల్

గురువారం । 8 । ఫిబ్రవరి । 2024



నాగోబా స్మరణలో..

8లో▸

నాగోబా స్మరణలో మర్రిచెట్టు వద్ద బసచేసిన మెస్రం వంశీయులు ప్రత్యేక పూజలు చేస్తున్నారు. గంగాజలంతో వచ్చిన మెస్రం వంశీయులు కేస్లాపూర్ పొలిమేరలో మర్రిచెట్టు వద్ద బస చేశారు.

నేడు ఉమ్మడి జిల్లా సమావేశం

ఆసిఫాబాద్: నిర్మల్ కలెక్టరేట్ సమావేశ మందిరంలో గురువారం ఉదయం 11 గంటలకు ఫొటో ఓటరు జాబితా సవరణ కార్యక్రమం-2024పై ఉమ్మడి ఆదిలాబాద్ జిల్లాస్థాయి సమావేశం నిర్వహిస్తున్నట్లు ఆసిఫాబాద్ కలెక్టర్ హేమంత్ బోర్కడే తెలిపారు. ఈ సమావేశానికి ఓటరు జాబితా పరిశీలకులు జి.భారతి లక్‌పతి నాయక్ హాజరవుతారని పేర్కొన్నారు. ఎన్నికల అధికారులు హాజరు కావాలని సూచించారు.

వాతావరణం

గరిష్టం/కనిష్టం
33.3 / 19.5

వాతావరణం పొడిగా ఉంటుంది. ఉష్ణోగ్రతలు సాధారణం కన్నా ఎక్కువగా నమోదవుతాయి. మధ్యాహ్నం వేడిగా ఉంటుంది. చలి ప్రభావం పూర్తిగా తగ్గుతుంది.

న్యూస్‌రీల్

కేంద్ర మంత్రిని కలిసిన 'ఏలేటి'



కేంద్ర ఆర్థిక శాఖ మంత్రితో చర్చిస్తున్న ఏలేటి

నిర్మల్‌చైన్‌గేట్: కేంద్ర ఆర్థిక మంత్రి శ్రీమతి నిర్మలా సీతారామన్‌ను నిర్మల్ ఎమ్మెల్యే ఏలేటి మహేశ్వర్‌రెడ్డి ఢిల్లీలో బుధవారం మర్యాదపూర్వకంగా కలిశారు. కేంద్రం గ్రామీణ ప్రాంతాల కోసం ఎంజీఎన్‌ఆర్‌ఈజీఎస్ పథకం ద్వారా నిధులు రాష్ట్రానికి ఇస్తే, వాటిని రాష్ట్ర ప్రభుత్వం దుర్వినియోగం చేస్తుందని తెలిపారు. నిధులు సద్వినియోగం అయ్యేలా చర్యలు తీసుకోవాలని కోరారు.

నితిన్ గడ్కరీని కలిసిన ముధోల్ ఎమ్మెల్యే



గడ్కరీకి వినతిపత్రం ఇస్తున్న రామారావుపటేల్

భైంసాటౌన్: జాతీయ రహదారుల శాఖ మంత్రి నితిన్ గడ్కరీని ముధోల్ ఎమ్మెల్యే పవార్ రామారావు పటేల్ బుధవారం మర్యాదపూర్వకంగా కలిశారు. ఢిల్లీలోని ఆయన కార్యాలయంలో కలిసి పుష్పగుచ్ఛం, శాలువాతో సత్కరించారు. ఈ సందర్భంగా నియోజకవర్గంలో రోడ్లు, రవాణా సమస్యలను ఆయన దృష్టికి తీసుకెళ్లారు. రహదారుల అభివృద్ధికి సహకరించాలని కోరారు.

'పది' ప్రత్యేక పరీక్షల తనిఖీ

- డీఈవో రవీందర్‌రెడ్డి



న్యూవెల్మల్‌లో పరీక్షను పరిశీలిస్తున్న డీఈవో

లక్ష్మణచాంద/మామడ/సోన్: పదో తరగతి ప్రత్యేక ప్రణాళికలో భాగంగా జిల్లా వ్యాప్తంగా విద్యార్థులకు నిర్వహిస్తున్న ప్రత్యేక పరీక్షలను డీఈవో బుధవారం తనిఖీ చేశారు. లక్ష్మణచాంద, మామడ, సోన్ మండలాల్లో ఆయన పర్యటించారు. లక్ష్మణచాందలోని ప్రభుత్వ పాఠశాల, కేజీబీవీలో ప్రత్యేక పరీక్షలను పరిశీలించారు. మామడ మండలం కొరిటికల్, మామడ జిల్లా పరిషత్ సెకండరీ పాఠశాలలను తనిఖీ చేశారు. సోన్ మండలం న్యూవెల్మల్ బొప్పారం ఉన్నత పాఠశాలను పరిశీలించారు. పరీక్షలకు ప్రతీ విద్యార్థి హాజరయ్యేలా చూడాలని ఉపాధ్యాయులకు సూచించారు. పరీక్షలకు హాజరుకాని విద్యార్థుల తల్లిదండ్రులకు ఫోన్ చేసి విద్యార్థులు వచ్చేలా చూడాలన్నారు. పరీక్షలు నిర్వహించి అనంతరం మూల్యాంకనం చేసి విద్యార్థులకు ఏయే విషయాలలో తక్కువ మార్కులు వచ్చాయో గుర్తించి వాటిలో మార్కులు ఎక్కువ సాధించేలాగా చూడాలని వివరించారు. అభ్యాస దీపికలను సాధన చేయించాలని తెలిపారు. డీఈవో వెంట ప్రధానోపాధ్యాయులు రాజునాయక్, వెంకటరమణారెడ్డి, నాలం శ్రీనివాస్, ఎస్‌వో నవిత, ఉపాధ్యాయులు ఉన్నారు.

క్రీడలతో మానసిక, శారీరక దారుఢ్యం

- ప్రభుత్వ డిగ్రీ కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ జె.భీమారావు



మాట్లాడుతున్న కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ భీమారావు

నిర్మల్‌ఖిల్లా: చిన్నతనం నుంచి క్రీడలలో పాల్గొనడం వల్ల శారీరక దారుఢ్యంతోపాటు మానసిక ప్రశాంతత చేకూరుతుందని ప్రభుత్వ డిగ్రీ కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ జె.భీమారావు అన్నారు. జిల్లా కేంద్రంలోని ప్రభుత్వ డిగ్రీ కళాశాల మైదానంలో నిర్మల్ జిల్లా అథ్లెటిక్స్ అసోసియేషన్ ఆధ్వర్యంలో 14 ఏళ్లలోపు బాలబాలికలకు రన్నింగ్, లాంగ్ జంప్, బ్రాడ్ జంప్ పోటీలు బుధవారం నిర్వహించారు. ఈ సందర్భంగా అసోసియేషన్ కార్యదర్శి శామ్యూల్, పాఠశాల క్రీడల కార్యదర్శి రమణారావుతో కలిసి ఆయన పాల్గొన్నారు. విద్యార్థులకు చిన్నప్పటి నుండే క్రీడలపై అభిరుచి పెంపొందించాలని సూచించారు. కార్యక్రమంలో వ్యాయామ ఉపాధ్యాయులు సత్తయ్య, అన్నపూర్ణ, భూమన్న, నిర్వాహకులు గిరి, సంజీవ్, పెంటన్న, స్వప్న తదితరులు పాల్గొన్నారు.

తొలి బడ్జెట్‌పై ఆశలు



- రాష్ట్ర సర్కారు ఏమిస్తుందో..!?
- ఇప్పటికే ప్రభుత్వం దృష్టికి సమస్యలు
- పలు పనులు కావాలంటున్న ప్రజాప్రతినిధులు
- బడ్జెట్ సమావేశాలకు సిద్ధమైన ఎమ్మెల్యేలు

నిర్మల్: రాష్ట్రంలో కాంగ్రెస్ సర్కారు కొలువుదీరిన తర్వాత తొలి బడ్జెట్‌ను ప్రవేశపెట్టబోతోంది. ఇందులో జిల్లాకు ఎంతవరకు నిధులు వస్తాయి.. ఏమేం అభివృద్ధి ఫలాలు దక్కుతాయన్న చర్చ నడుస్తోంది. రేవంత్ సర్కారు ప్రవేశపెట్టబోతున్న తొలి బడ్జెట్‌కు జిల్లాలోని ముగ్గురు ఎమ్మెల్యేలు సిద్ధమయ్యారు. తమ నియోజకవర్గాలకు న్యాయం చేసేలా కేటాయింపులు ఉండాలని కోరుతున్నారు. ఇదివరకే తమ పరిధిలోని ప్రధాన సమస్యలు, కావాల్సిన నిధులను ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లామని, వాటిపై సానుకూలంగా స్పందన ఉంటుందని భావిస్తున్నామని చెబుతున్నారు. అధికార పార్టీకి చెందిన ఖానాపూర్ ఎమ్మెల్యే వెడ్మ బొజ్జు పటేల్, డీసీసీ అధ్యక్షుడు శ్రీహరిరావు సైతం ఇప్పటికే జిల్లాకు కావాల్సిన పనులు, నిధులపై సీఎం రేవంత్‌రెడ్డి దృష్టికి తీసుకెళ్లారు. మరోవైపు జిల్లావాసులు సైతం గురువారం నుంచి ప్రారంభం కానున్న రాష్ట్ర బడ్జెట్ సమావేశాలను ఆసక్తిగా గమనిస్తున్నారు.

నిర్మల్ నియోజకవర్గంలో..

రాష్ట్ర ప్రభుత్వం ప్రవేశ పెట్టనున్న బడ్జెట్‌లో నిర్మల్ నియోజకవర్గానికి అధికమొత్తంలో నిధులు కేటాయించాలన్న డిమాండ్ ఉంది. నిర్మల్ మున్సిపాలిటీతోపాటు మండలాల్లోనూ గత ప్రభుత్వం చేపట్టిన చాలా పనులు అర్ధాంతరంగా నిలిచిపోయాయి. వాటన్నింటికీ నిధులివ్వాలని ఎమ్మెల్యే మహేశ్వర్‌రెడ్డి కోరుతున్నారు. నియోజకవర్గంలో స్వర్ణనదిపై నిర్మించిన చెక్‌డ్యామ్‌లతో ఇబ్బందులు, వరదలు, వాటిలో సరిదిద్దాల్సిన లోపాలను ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లారు. నిర్మల్ జిల్లాకేంద్రంతోపాటు చాలాగ్రామాలకు సరైన రోడ్లు లేవు. వీటిని పూర్తిచేయడానికి నిధులివ్వాలని డిమాండ్ చేస్తున్నట్లు చెప్పారు. డీసీసీ అధ్యక్షుడు శ్రీహరిరావు సైతం నిర్మల్ నియోజకవర్గ సమస్యలను సీఎం దృష్టికి తీసుకెళ్లారు. సదర్మాట్ ప్రాజెక్టు పూర్తి చేయడంతోపాటు మామడ, కప్పన్‌పల్లి, దిమ్మదుర్తి లిఫ్ట్ ఇరిగేషన్ ఏర్పాటు చేయాలని కోరారు. స్వర్ణనది ఆధునికీకరణ చేసి చివరి ఆయకట్టుకు నీరందించేలా చూడాలని విన్నవించారు.

ముధోల్‌లో..

రాష్ట్ర సరిహద్దు నియోజకవర్గం ముధోల్‌పై ప్రభుత్వం దృష్టిపెట్టాల్సిన అవసరం ఉంది. ప్రధానంగా ఇక్కడ తాగు, సాగునీటి సమస్యలు ఉన్నాయని స్థానిక ఎమ్మెల్యే రామారావుపటేల్ ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లారు. వర్షాకాలంలో కొట్టుకుపోయిన సిరాల ప్రాజెక్టుకు వెంటనే నిధులివ్వాలని కోరారు. మిషన్ భగీరథ, ఆర్‌డబ్ల్యూఎస్‌లో లోపాలను సరిచేయాలని సూచించారు. ఇక ఏళ్లుగా ఇబ్బందులు పడుతున్న ముంపు గ్రామం గుండెగాం విషయాన్ని ఎమ్మెల్యేతోపాటు కాంగ్రెస్ నేతలూ కూడా ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లారు. కానీ.. కొత్త ప్రభుత్వం పెట్టే కొత్త బడ్జెట్‌లో అయినా ఆ ఊరిని సర్కారు కరుణిస్తుందా..లేదా అనేది చూడాలి.

నిధులు కేటాయించాలని..

జిల్లాలో గత ప్రభుత్వం హయాంలో నిధులు లేక నిలిచిపోయిన పనులు చాలానే ఉన్నాయి. వీటిని ఈసారి నిధులివ్వాలన్న డిమాండ్ ఉంది. కాంగ్రెస్ సైతం తమ సర్కారు దృష్టికి ఈ సమస్యలను తీసుకెళ్లింది.

- నిర్మల్ నియోజకవర్గంలోని కాళేశ్వరం 27 ప్యాకేజీ, ముధోల్ నియోజకవర్గంలోని 28 ప్యాకేజీలను పూర్తిచేసి, సాగునీరందించాలి.
- బాసరలోని ట్రిపుల్‌ఐటీకి ప్రత్యేకంగా నిధులను కేటాయించడంతోపాటు అంతర్జాతీయస్థాయి వర్సిటీని తీర్చిదిద్దాలి.
- కడెం, సదర్మాట్ ప్రాజెక్టులతోపాటు స్వర్ణ, గడ్డెన్నవాగు ప్రాజెక్టులు, వాటి కాలువల మరమ్మతులు చేపట్టాలి.
- ఎస్సారెస్పీ నుంచి వచ్చే సరస్వతి కాలువను ఆధునికీకరించాలి.
- సదర్మట్ ప్రాజెక్టు పూర్తిచేయడంతోపాటు బ్యాక్‌వాటర్ నుంచి లిఫ్ట్ ఇరిగేషన్ ద్వారా పలు గ్రామాలకు నీరందించాలి.
- పెండింగ్‌లో ఉన్న సమీకృత మార్కెట్లు, క్రీడాప్రాంగణాలు, పర్యాటక అభివృద్ధికి బడ్జెట్‌లో నిధులివ్వాలని జిల్లా కోరుతోంది.

ఖానాపూర్‌లో..

నీళ్లు, అడవులు పుష్కలంగా ఉన్నా అభివృద్ధి అంతంతగానే ఉన్న ఖానాపూర్ సైతం బడ్జెట్‌పై భారీగానే ఆశలు పెట్టుకుంది. స్థానిక ఎమ్మెల్యే బొజ్జు అధికార పార్టీకి చెందినవారు కావడంతోపాటు సీఎం రేవంత్‌కు దగ్గర అన్న పేరుంది. ఇటీవల ఇంద్రవెల్లి సభలోనే తమ నియోజకవర్గానికి కావాల్సినవి సీఎం దృష్టికి తీసుకెళ్లినట్లు ఎమ్మెల్యే బొజ్జు తెలిపారు. ప్రధానంగా కడెం, సదర్మట్ ప్రాజెక్టులకు నిధులు, లక్ష్మీపూర్ లిఫ్ట్ ఇరిగేషన్, ఖానాపూర్ రెవెన్యూ డివిజన్, ఇక్కడ ప్రభుత్వ డిగ్రీకళాశాల, గిరిజన విశ్వవిద్యాలయం, అన్నిగ్రామాలకు రోడ్లు, తాగు, సాగునీటి సౌకర్యం కల్పించాలని ముఖ్యమంత్రికి వివరించినట్లు పేర్కొన్నారు. బడ్జెట్‌లో ఈమేరకు నిధులు వస్తాయన్న నమ్మకం ఉందని తెలిపారు. లేనిపక్షంలో ప్రభుత్వం ప్రత్యేక దృష్టిపెట్టి నియోజకవర్గంలో పనులు చేయిస్తుందని చెప్పారు.

పిల్లలపై ప్రత్యేక శ్రద్ధ కనబర్చాలి



సమావేశంలో మాట్లాడుతున్న కలెక్టర్

నిర్మల్‌చైన్‌గేట్: సామ్ మామ్ పిల్లలపై ప్రత్యేక శ్రద్ధ పెట్టాలని, బరువు తక్కువగా ఉన్న వారిని గుర్తించి పౌష్టికాహారం అందించాలని కలెక్టర్ ఆశిష్ సంగ్వాన్ సూచించారు. మహిళా అభివృద్ధి, శిశు సంక్షేమ శాఖ అధికారులతో కలెక్టరేట్‌లో బుధవారం సమీక్ష నిర్వహించారు. గత సమావేశానికి, ఇప్పటికీ శిశు సంక్షేమ శాఖ ద్వారా అందిస్తున్న పౌష్టికాహారం, శామ్ మామ్, న్యూట్రిషన్ గార్డెన్, మిషన్ వాత్సల్య, అంగన్వాడీ భవనాలు, తదితర వాటి పురోగతిని మండలాల వారీగా అడిగి తెలుసుకున్నారు. శామ్ మామ్ పిల్లలను గుర్తించడంలో నిర్లక్ష్యం వహించి, సరైన సమాధానం చెప్పక పోవడంతో అసహనం వ్యక్తం చేశారు. ప్రభుత్వ, ప్రైవేట్ భవనాలలో ఉన్న అంగన్‌వాడీ కేంద్రాలు, సొంత భవనాలకు మరమ్మతులు ఉంటే నివేదిక ఇవ్వాలని సూచించారు. ప్రతీ అంగన్‌వాడీ కేంద్రంలో న్యూట్రిషన్ గార్డెన్ ఏర్పాటు చేయాలన్నారు. సమావేశంలో డీడబ్ల్యూవో ఇన్‌చార్జి నాగమణి, సీడీపీవోలు, సూపర్‌వైజర్లు పాల్గొన్నారు.

ఇటిక్యాల్‌లో అదనపు కలెక్టర్ పర్యటన



ఇటిక్యాల్‌లో పర్యటిస్తున్న అదనపు కలెక్టర్

పెంబి: మండలంలోని ఇటిక్యాల్ గ్రామంలో బుధవారం అదనపు కలెక్టర్ ఫైజాన్ అహ్మద్ పర్యటించారు. గ్రామ పంచాయతీలోని పలు రికార్డులతోపాటు అక్కడే ఉన్న నర్సరీని పరిశీలించారు. సర్పంచుల పదవులు ముగిసినందున స్పెషల్ ఆఫీసర్లను నియమించినట్లు తెలిపారు. గ్రామాల అభివృద్ధికి పాటుపడాలని సూచించారు. ఆయన వెంట మాజీ సర్పంచ్ మహేందర్, ఎంపీడీవో సుధాకర్‌రెడ్డి, ఎంపీవో రత్నాకర్‌రావు, స్పెషల్ ఆఫీసర్ పీఆర్ ఈఈ కమలాకర్, పంచాయతీ కార్యదర్శి, ఎఫ్‌ఏలు ఉన్నారు.

గొలుసు కాలువను మళ్లించారు!



తహసీల్దార్‌ను నిలదీస్తున్న రైతులు

- రాత్రివేళ కొత్త కాలువ తవ్వకం
- పట్టించుకోని అధికారులు
- రైతుల నిరసన



మంగళవారం రాత్రి తవ్విన కాలువ

నర్సాపూర్ (జి): మండల కేంద్రంలో చెరువులు, గొలుసుకట్టు కాలువలు ఆక్రమణకు గురవుతున్నా అధికారులు పట్టించుకోవడం లేదు. గొలుసుకట్టు కాలువలను పూడ్చడంపై రైతులు ఇటీవల ప్రజావాణిలో ఫిర్యాదు చేశారు. అయినా అధికారులు చూసీ చూడనట్లు వ్యవహరిస్తున్నారు. దీంతో వ్యవసాయ భూములను వెంచర్లుగా మారుస్తున్న యజమానులు కాలువలనే దారి మళ్లిస్తున్నారు. అయినా అధికారులు అటువైపు కన్నెత్తి చూడకపోవడంపై రైతులు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు.

వ్యవసాయ భూమి వెంచర్‌గా..

మండల కేంద్రానికి చెందిన జీవీ.భూమేశ్వర్‌రెడ్డి, జీవీ.అనిల్‌రెడ్డి సర్వే నంబర్లు 635, 638లో ఉన్న 13.30 ఎకరాల వ్యవసాయ భూమిని కొనుగోలు చేశారు. దానిని నాల కన్వర్షన్ చేసుకుని డీటీసీ అనుమతి పొందేలా లేఅవుట్ చేశారు. అయితే ఆ వ్యవసాయ భూమిలో నుంచి ఉన్న గొలుసు కట్టు కాలువను పూడ్చివేశారు. దీంతో ఆయకట్టు రైతులు గొలుసుకట్టు కాలువ పునరుద్ధరించాలని తహసీల్దార్‌కు ఫిర్యాదు చేశారు. అయినా స్పందించకపోవడంతో జనవరి 29న ప్రజావాణికి వెళ్లి కలెక్టర్‌కు ఫిర్యాదు చేశారు. అక్రమ లేఅవుట్ చేస్తున్నవారిపై చర్య తీసుకోవాలని, గొలుసు కట్టు కాలువ ఉండగా నాలా అనుమతి ఇచ్చిన అధికారులపైనా చర్య తీసుకోవాలని కోరారు. స్పందించిన కలెక్టర్ రెవెన్యూ, ఇరిగేషన్ అధికారులను పంపించి సర్వే చేయాలని ఆదేశించారు. గొలుసుకట్టు కాలువను పునరుద్ధరించాలని ఆదేశించారు.

30న విచారణ..

కలెక్టర్ ఆదేశాలతో జనవరి 30న రెవెన్యూ, నీటిపారుదల శాఖ అధికారులు మండల కేంద్రానికి వచ్చారు. సర్వేనంబర్లు 635, 638లలో ఉన్న స్థలాన్ని పరిశీలించారు. లేఅవుట్ చేసిన భూమిలో నుంచి గొలుసు కట్టు కాలువ ఉందని నిర్ధారించారు. పాత నక్ష ప్రకారం కాలువ పునరుద్ధరించాలని అదేరోజు వెంచర్ యజమానులు, రైతుల సమక్షంలో ముగ్గు కూడా పోశారు. అయితే ఈమేరక పంచనామా కాపీని కలెక్టర్‌కు, రెవెన్యూ అధికాదికి ఇవ్వలేదు. దీంతో పనులు ప్రారంభించలేదు.

కోర్టు నుంచి స్టే తెచ్చుకుని..

పంచనామా కాపీ ఇవ్వడంలో అధికారులు చేసిన జాప్యంతో వెంచర్ యజమానులు కోర్టును ఆశ్రయించారు. తమ వెంచర్‌లో నుంచి కాలువ తవ్వకుండా స్టే తెచ్చుకున్నారు. అనంతరం తమ వెంచర్‌కు నష్టం జరుగకుండా మంగళవారం రాత్రి ఎవరికీ సమాచారం ఇవ్వకుండా జేసీబీతో కాలువ తవ్వించారు. నక్ష ప్రకారం కాకుండా.. తన వెంచర్‌కు ఇబ్బంది కలుగకుండా కాలువ తవ్వారు. బుధవారం ఈ విషయం తెలుసుకున్న రైతులు తహసీల్దార్ కార్యాలయానికి వెళ్లారు. తహసీల్దార్ శ్రీనివాస్‌ను నిలదీశారు. ఈవిషయం తనకు కూడా తెలియదని తహసీల్దార్ చెప్పారు. 'మీరు ఎక్కడికైనా వెళ్లండి.. ఎవరికైనా చెప్పుకోండి' అంటూ దురుసుగా మాట్లాడారు. తహసీల్దార్ వ్యవహరించిన తీరుపై రైతులు నిరసన తెలిపారు. అనంతరం స్టే ఆర్డర్ చూపకుండా, అక్రమంగా కాలువ తవ్విన వారిపై చర్య తీసుకోవాలని తహసీల్దార్, ఎస్సైకి ఫిర్యాదు చేశారు.

వేసవిలో మంచినీటికి కొరత రావొద్దు

- కలెక్టర్ ఆశిష్ సంగ్వాన్



వాటర్ ట్రీట్ ప్లాంట్‌ను పరిశీలిస్తున్న కలెక్టర్

దిలావర్‌పూర్: రానున్న వేసవి కాలంలో గ్రామాల్లో మంచినీటి సమస్య రాకుండా ఇప్పటి నుంచే చర్యలు చేపట్టాలని కలెక్టర్ ఆశిష్ సంగ్వాన్ ఆదేశించారు. ఆదిలాబాద్, నిర్మల్ జిల్లాలకు శుద్ధ జలాన్ని అందించే మాడేగాం వాటర్ ట్రీట్ ప్లాంట్‌ను అధికారులతో కలిసి బుధవారం సందర్శించారు. వాటర్ గ్రిడ్‌లో వాటర్ ట్రీట్, రావాటర్ ఏవియేటర్, శుద్ధజల ప్రక్రియ, వాటర్ ట్రీట్‌కు సంబంధించి ల్యాబొరేటరీ, నీటి సరఫరా జరుగుతున్న తీరును పరిశీలించారు. వాటర్ ట్రీట్, ఇంట్రా, గ్రావిటీపై నీటి సరఫరా వంటి తదితర విషయాలను మిషన్ భగీరథ ఈఈ సందీప్ వివరించారు. అనంతరం కలెక్టర్ మాట్లాడుతూ వేసవి ప్రారంభం అవుతున్న నేపథ్యంలో నిత్యం రెండుసార్లు ఓహెచ్‌ఎస్‌ఆర్ ట్యాంకులు నింపాలని సూచించారు. కలెక్టర్ వెంట తహసీల్దార్ డి.సరిత, ఎంపీడీవో మోహన్, ఎంపీవో అజీజ్‌ఖాన్, పంచాయతీ కార్యదర్శి శ్రావణ్, స్థానిక అధికారులు ఉన్నారు.

సార్వత్రిక సమ్మె విజయవంతం చేయాలి

- సీఐటీయూ జిల్లా ప్రధాన కార్యదర్శి బొమ్మెన సురేశ్



డీపీవోకు సమ్మె నోటీసు అందజేస్తున్న సురేష్

నిర్మల్‌చైన్‌గేట్: కార్మికుల హక్కుల సాధన కోసం కేంద్ర కార్మిక సంఘాలు ఫిబ్రవరి 16న దేశవ్యాప్తంగా తలపెట్టిన ఒకరోజు సమ్మెను నిర్మల్ జిల్లాలో అన్నిరంగాలకు చెందిన ఉద్యోగులు, కార్మికులు విజయవంతం చేయాలని సీఐటీయూ జిల్లా ప్రధాన కార్యదర్శి బొమ్మెన సురేశ్ కోరారు. జిల్లా కేంద్రంలోని డీపీవో కార్యాలయంలో గ్రామ పంచాయతీ ఉద్యోగుల తరఫున సమ్మె నోటీస్ ఇచ్చారు. సమ్మెలో పంచాయతీ కార్మికులు పాల్గొంటారని తెలిపారు. అనంతరం ఆయన మాట్లాడుతూ కేంద్రంలోని బీజేపీ ప్రభుత్వం అనుసరిస్తున్న కార్మిక వ్యతిరేక విధానాలపై దేశవ్యాప్తంగా కార్మికవర్గం పోరాటానికి సిద్ధమైందన్నారు. గ్రామపంచాయతీ కార్మికులకు కనీస వేతనం రూ.26 వేలు ఇవ్వాలని మల్టీపర్పస్ వర్కర్ విధానం రద్దు చేయాలని డిమాండ్ చేశారు. కారోబార్, బిల్ కలెక్టర్లను సహాయ కార్యదర్శులుగా నియమించాలన్నారు. జిల్లా వ్యాప్తంగా ఆరు నెలల నుంచి పెండింగ్‌లో ఉన్న వేతనాలను చెల్లించాలని డిమాండ్ చేశారు. కార్మికులకు ప్రమాద బీమా రూ.10 లక్షలు, పీఎఫ్, ఈఎస్ఐ సౌకర్యాలు కల్పించాలన్నారు. వినతిపత్రం ఇచ్చినవారిలో వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా అధ్యక్షుడు డాకూర్ తిరుపతి ఉన్నారు.

ప్లాస్టిక్‌ను నిషేధించాలి

సోన్: ప్లాస్టిక్‌ను నిషేధించాలని డీపీవో శ్రీలత అన్నారు. ప్రత్యేక పారిశుధ్య కార్యక్రమంలో భాగంగా సోన్ మండలం న్యూవెల్మల్‌లో బుధవారం నిర్వహించిన గ్రామ సభలో మాట్లాడారు. పరిసరాల పరిశుభ్రత అందరి బాధ్యత అన్నారు. వ్యక్తిగత శుభ్రతతోపాటు పరిసరాలు, ప్రభుత్వ కార్యాలయాలను శుభ్రపర్చుకోవాలని సూచించారు. తడి, పొడి చెత్తను వేరుచేసి అందించాలని తెలిపారు. డ్రైనేజీ, సీసీ రోడ్లు అవసరమైన చోట నిర్మించాలని పేర్కొన్నారు. అంతకుముందు పాక్‌పట్ల గ్రామంలో ఎంపీడీవో మోహన్‌రెడ్డి స్వచ్ఛ ప్రతిజ్ఞ చేయించారు. కార్యక్రమంలో ప్రత్యేక అధికారి రాజమల్లు, కార్యదర్శులు లక్ష్మణ్, సంధ్య, అంగన్‌వాడీ టీచర్లు, ఆశ వర్కర్లు, ఏఎన్‌ఎంలు, గ్రామస్తులు పాల్గొన్నారు.

ఐక్యతే ఆయుధం

- టీఎస్ యూటీఎఫ్ ప్రధాన కార్యదర్శి అశోక్

సోన్: ఉపాధ్యాయుల ఐక్యతే హక్కుల సాధనకు ఆయుధమని టీఎస్ యూటీఎఫ్ జిల్లా ప్రధాన కార్యదర్శి అశోక్ అన్నారు. లెఫ్ట్ పోచంపాడ్ గురుకుల పాఠశాలలో బుధవారం సభ్యత్వ నమోదు చేపట్టారు. ఈ సందర్భంగా అశోక్ మాట్లాడుతూ ఉపాధ్యాయుల సమస్యల పరిష్కారానికి యూటీఎఫ్ పోరాడుతుందన్నారు. గురుకుల పాఠశాలలో మహిళా ఉపాధ్యాయులు ఎదుర్కొంటున్న సమస్యలను తెలుసుకుని ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్తామన్నారు. కార్యక్రమంలో కోశాధికారి నాగయ్య కుర్మే, జిల్లా నాయకులు ఎస్.బక్కన్న తదితరులు పాల్గొన్నారు.



లెఫ్ట్ పోచంపాడ్ గురుకుల పాఠశాలలో యూటీఎఫ్ క్యాలెండర్ ఆవిష్కరిస్తున్న ఉపాధ్యాయులు

కుష్ఠు నివారణకు కృషి చేద్దాం

- పీవో డాక్టర్ రవీందర్‌రెడ్డి



విద్యార్థులతో ప్రతిజ్ఞ చేయిస్తున్న రవీందర్‌రెడ్డి

నిర్మల్‌చైన్‌గేట్: కుష్ఠు వ్యాధి నివారణలో ప్రతి ఒక్కరూ భాగస్వాములు కావాలని కుష్ఠు, ఎయిడ్స్, టీబీ నివారణ అధికారి డాక్టర్ రవీందర్‌రెడ్డి సూచించారు. నిర్మల్ పట్టణంలోని సోమవార్‌పేట్ బాలికల ఉన్నత పాఠశాలలో బుధవారం అవగాహన కార్యక్రమం నిర్వహించారు. తెల్లని, ముదురు గోధుమ రంగులో స్పర్శ లేని మచ్చలు ఒంటిపై ఉంటే ప్రభుత్వ ఆసుపత్రికి వెళ్లి పరీక్షలు చేయించుకోవాలని సూచించారు. మందులు వాడడం వల్ల ఈ వ్యాధి పూర్తిగా నయం అవుతుందని తెలిపారు. వ్యాధిగ్రస్తులపై వివక్ష చూపొద్దన్నారు. అనంతరం విద్యార్థులతో వ్యాధి నివారణలో భాగస్వాములమవుతామని ప్రతిజ్ఞ చేయించారు. డీపీఎంవో రాజేశ్వర్, లేప్రా సొసైటీ ఫిజియోథెరపిస్టు కిషన్‌రావు, హెచ్‌ఎం ఎం.పరమేశ్వర్, ఉపాధ్యాయులు జాఫర్ మొయినుద్దీన్, మునీందర్ రాజు, రామారావు పాల్గొన్నారు.

పిల్లలందరికీ ఆల్బెండజోల్ మాత్రలు

- డీఎంహెచ్‌వో డాక్టర్ ధనరాజ్



శిక్షణ కార్యక్రమానికి హాజరైన వైద్య సిబ్బంది

నిర్మల్‌చైన్‌గేట్: ఈ నెల 12న నులి నివారణ దినం సందర్భంగా ఏడాది నుంచి 19 ఏళ్లలోపు పిల్లలందరికీ ఆల్బెండజోల్ మాత్రలు అందించాలని జిల్లా వైద్యాధికారి డాక్టర్ ధనరాజ్ సూచించారు. జిల్లాలోని వైద్యాధికారులు, పర్యవేక్షక సిబ్బందికి నులిపురుగుల నిర్మూలన, పల్స్ పోలియో కార్యక్రమంపై డీఎంహెచ్‌వో కార్యాలయంలో బుధవారం ఒకరోజు శిక్షణ కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ప్రపంచ ఆరోగ్య సంస్థ సర్వలెన్స్ వైద్యాధికారి డాక్టర్ అతుల్ పల్స్ పోలియోపై శిక్షణ ఇచ్చారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మార్చి 3వ తేదీన నిర్వహించే పల్స్ పోలియో కార్యక్రమంలో 0–5 సంవత్సరాల పిల్లలందరికీ పోలియో చుక్కలు వేస్తామని తెలిపారు. సిబ్బంది సమన్వయంతో పని చేసి కార్యక్రమాన్ని విజయవంతం చేయాలన్నారు. ఈ కార్యక్రమంలో డిప్యూటీ జిల్లా వైద్య, ఆరోగ్యశాఖ అధికారి డాక్టర్ రాజేందర్, జిల్లా వ్యాధి నిరోధక టీకాలు అధికారి డాక్టర్ నయనరెడ్డి, డిప్యూటీ జిల్లా విస్తరణ, మీడియా అధికారి రవీందర్, జిల్లాలోని వైద్యాధికారులు, పర్యవేక్షక సిబ్బంది పాల్గొన్నారు.

10న జిల్లా స్థాయి కబడ్డీ పోటీలు

ముధోల్: జిల్లా కబడ్డీ అసోషియేషన్ ఆధ్వర్యంలో ఈనెల 10న జిల్లాస్థాయి కబడ్డీ పోటీలు నిర్వహించనున్నట్లు అసోసియేషన్ కార్యదర్శి బి.సునీల్ తెలిపారు. 16 ఏళ్లలోపు(20-03-2008 తర్వాత జన్మించినవారు)వారు అర్హులని పేర్కొన్నారు. ఎడ్‌బిడ్ జిల్లా పరిషత్ పాఠశాల మైదానంలో పోటీలు ఉంటాయని తెలిపారు. ప్రతిభ కనబర్చిన క్రీడాకారులు ఈనెల 16 నుంచి 19వ తేదీ వరకు సూర్యపేట జిల్లాలోని మల్లారెడ్డిగూడెంలో నిర్వహించనున్న రాష్ట్రస్థాయి పోటీల్లో పాల్గొంటారని తెలిపారు. పోటీల్లో పాల్గొనేవారు ఆధార్‌కార్డు, స్కూల్ బోనఫైడ్ సర్టిఫికెట్, రూ.100 ఎంట్రీఫీజు తీసుకుని పీఈటీలు శ్రీధర్‌రెడ్డి, కె.సునీల్‌కు రిపోర్టు చేయాలని సూచించారు.

క్లుప్తంగా

'28 కులాలను ఓబీసీలో చేర్చాలి'


వినతిపత్రం ఇస్తున్న ఎమ్మెల్యే రామారావుపటేల్

భైంసా: 28 కులాలను ఓబీసీ జాబితాలో చేర్చాలని ముధోల్ ఎమ్మెల్యే రామారావు పటేల్ బుధవారం బీసీ కమిషన్ చైర్మన్ హంసరాజును కోరారు. నిర్మల్ ఎమ్మెల్యే ఏలేటి మహేశ్వర్‌రెడ్డి, ఆదిలాబాద్ ఎమ్మెల్యే పాయల శంకర్, సిర్పూర్ ఎమ్మెల్యే పాల్వాయి హరీశ్‌బాబుతో కలిసి ఢిల్లీలో ఆయనను వినతిపత్రం అందజేశారు. ఆరె మరాఠా, బుక్క అయ్యవార్లు, గౌడజట్టి, కుల్లకడిగితో పాటు మొత్తం 28 కులాలను ఓబీసీ జాబితాలో చేర్చాలని కోరారు. ఓబీసీలో చేర్చకపోవడంతో 28 కులాలకు చెందిన విద్యార్థులు విద్య, ఉద్యోగపరంగా నష్టపోతున్నారన్నారు.

పశువులు తరలిస్తున్న లారీ పట్టివేత


లారీలో తరలిస్తున్న పశువులు

నేరడిగొండ: పశువులను అక్రమంగా తరలిస్తున్న లారీని పట్టుకున్నట్లు ఎస్సై సాయన్న తెలిపారు. ఆదిలాబాద్ నుంచి నిర్మల్ వైపు ఓ లారీలో అక్రమంగా పశువులు తరలిస్తున్నట్లు తమకు అందిన సమాచారం మేరకు బుధవారం సిబ్బందితో కలిసి కుప్టి ప్రాంతంలో వాహనాలను తనిఖీ చేసినట్లు ఆయన పేర్కొన్నారు. ఈ క్రమంలో ఓ డ్రైవర్ లారీని ఆపి పరారైనట్లు తెలిపారు. ఆ వాహనాన్ని తనిఖీ చేయగా అందులో పశువులు ఉన్నట్లు పేర్కొన్నారు. వాటిని గోశాలకు తరలించి కేసు నమోదు చేసినట్లు ఆయన వివరించారు.

నాగోబా స్మరణలో 'మెస్రం'

- మర్రిచెట్టు వద్ద కొనసాగుతున్న పూజలు
- దేవుడు, వంశ చరిత్రను బోధిస్తున్న పెద్దలు
- కితల వారీగా సామూహిక వంటలు


తూమ్ పూజలకు నైవేద్యం తయారు చేసేందుకు బియ్యం సేకరిస్తున్న మెస్రం వంశీయులు

ఇంద్రవెల్లి: నాగోబా స్మరణలో మర్రిచెట్టు వద్ద బస చేసిన మెస్రం వంశీయులు ప్రత్యేక పూజలు చేస్తున్నారు. పుష్యమాస అమావాస్యను పురస్కరించుకుని ఈ నెల 9న నిర్వహించే నాగోబా మహాపూజకు అవసరమయ్యే గంగాజలంతో వచ్చిన మెస్రం వంశీయులు కేస్లాపూర్ గ్రామ పొలిమేరలో పడియోర్ జన్మస్థలమైన మర్రిచెట్టు వద్ద బస చేశారు. ఉమ్మడి జిల్లా, మహారాష్ట్ర నుంచి మెస్రం వంశీయులు తరలివచ్చి ప్రత్యేక పూజలు చేస్తున్నారు. రాత్రి ప్రదాన్ కితకు చెందిన మెస్రం పెద్దల ఆధ్వర్యంలో కిక్రి వాయిస్తూ నాగోబా చరిత్ర, 22 కితల మెస్రం వంశీయుల చరిత్రను బోధిస్తున్నారు. బుధవారం 22 కితల వారీగా జొన్నగట్కతో సంప్రదాయ వంటలు చేసి నైవేద్యం సమర్పించారు. జొన్నగట్కను ఉండలు చేసి కితలవారీగా పంపిణీ చేశారు. రాత్రి మెస్రం వంశంలోని 22 కితాల్లో మరణించిన పెద్దల పేరుతో తూమ్ (కర్మకాండ) పూజలు చేశారు. 9న జాతర ప్రారంభించనున్నట్లు నాగోబా ఆలయ పీఠాధిపతి మెస్రం వెంకట్‌రావ్ తెలిపారు.

తూమ్ పూజలు (కర్మకాండ)

మర్రిచెట్టు వద్ద బస చేసిన మెస్రం వంశీయులు బుధవారం రాత్రి తూమ్ పూజ (కర్మకాండ) ఘనంగా నిర్వహించారు. 22 కితల మెస్రం వంశీయుల్లో మరణించిన పెద్దల పేర్లతో తూమ్ (కర్మకాండ)పూజలు చేశారు. తూమ్ పూజలతో వారు నాగోబా సన్నిధికి చేరినట్లు భావిస్తారు.


కష్టసుఖాలు తెలుసుకుంటున్న మెస్రం మహిళలు


వంటలు చేస్తున్న మెస్రం వంశ మహిళలు


ఎడ్లబండిపై వస్తున్న మెస్రం వంశీయులు

జొన్నగట్క ప్రత్యేకత


జొన్నగట్కతో తయారు చేస్తున్న ఉండలు

మెస్రం వంశీయుల సంప్రదాయ వంట జొన్నగట్కకు ప్రత్యేకత ఉంది. బియ్యం పాముఠంగులో ఉండడం, పప్పు ధాన్యాలు పాము కళ్ల ఆకారంలో పోల్చి నాగోబా పూజల ప్రారంభం నుంచి ముగింపు వరకు ఇండ్ల నుండి తీసుకొచ్చిన జొన్నగట్క, పిండి పదార్థాలతో తయారుచేసిన చారు (కూర)ను కితల వారీగా వండి భోజనాలు చేస్తారు.

నాగోబా ఆలయానికి చేరిన కుండలు


ఆలయ ఆవరణలో కుండలు

నాగోబా మహాపూజ, సంప్రదాయ పూజలకు అవసరమయ్యే సిరికొండ మండల కేంద్రంలోని గుగ్గిల స్వామి తయారు చేసిన ఏడు రకాల 350 మట్టి కుండలు, మట్టి పాత్రలు బుధవారం నాగోబా ఆలయానికి చేరాయి. 20 పెద్ద బాణాలు, 55 కుండలు, 55 మూతలు, 45 కడుముంతలు, 150 దీపాంతలను నాగోబా ఆలయంలో భద్రపరిచారు.

పాలకుల నిర్లక్ష్యంతో కలగానే రైల్వేలైన్


మాట్లాడుతున్న దుర్గం నూతన్‌కుమార్

నిర్మల్‌చైన్‌గేట్: పాలకుల నిర్లక్ష్యం కారణంగా ఆదిలాబాద్ నుండి ఆర్మూర్ వరకు రైల్వేలైన్ నిర్మాణం కలగా మారిందని సీపీఎం జిల్లా కార్యదర్శి వర్గ సభ్యుడు దుర్గం నూతన్ కుమార్ అన్నారు. వామపక్ష ప్రజాసంఘాల ఆధ్వర్యంలో బుధవారం జిల్లా కేంద్రంలో రౌండ్ టేబుల్ సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా నాయకులు మాట్లాడుతూ పార్లమెంట్‌లో బడ్జెట్ ప్రవేశపెట్టినప్పుడల్లా ఆదిలాబాద్, నిర్మల్ ప్రజానీకం బడ్జెట్‌లో నిధులు కేటాయించి రైల్వే నిర్మాణాన్ని పూర్తి చేస్తారేమోనని ఎదురుచూస్తున్నారన్నారు. రైల్వే లైన్‌కు నిధులు కేటాయించాలని కోరుతూ ఫిబ్రవరి 19న నిర్మల్ కలెక్టరేట్ ఎదుట వామపక్ష, ప్రజాసంఘాల ఆధ్వర్యంలో ధర్నా నిర్వహించనున్నట్లు తెలిపారు. సమావేశంలో సీపీఎం జిల్లా కార్యదర్శి గౌతమ్ కృష్ణ, సీపీఐఎంఎల్ ప్రజాపంథా జిల్లా కమిటీ సభ్యుడు ఆర్.రామలక్ష్మణ్, సీపీఐఎంఎల్ న్యూడెమోక్రసీ జిల్లా కార్యదర్శి రాజు, సీపీఎం జిల్లా కార్యదర్శి వర్గ సభ్యుడు, నిర్మల్ డివిజన్ కార్యదర్శి బొమ్మెన సురేష్, సీపీఎం జిల్లా కమిటీ సభ్యుడు డాకూర్ తిరుపతి, సీపీఎం నిర్మల్ మండల నాయకులు అతిక్, చందుల సాయి కిరణ్, బరుకుంట గంగారం, ఎస్ఎఫ్ఐ నాయకులు దిగంబర్, నవీన్, ఐఎఫ్‌టీయూ నాయకులు డి.గంగాధర్ పాల్గొన్నారు.

ట్రాక్టర్‌ను ఢీకొని ఇంటర్ విద్యార్థి మృతి


సుశ్వత్ (ఫైల్)

నిర్మల్‌టౌన్: మున్సిపల్ ట్రాక్టర్‌ను ఢీకొట్టిన ఘటనలో ఇంటర్ విద్యార్థి మృతి చెందిన సంఘటన జిల్లా కేంద్రంలో బుధవారం చోటు చేసుకుంది. స్థానికులు, ఎస్సై జ్యోతిమణి తెలిపిన వివరాల ప్రకారం... జిల్లా కేంద్రంలోని ఓ అపార్టుమెంటులో అద్దెకు ఉంటున్న డాక్టర్ సిద్ధార్థ్, భవాని ప్రసన్న దంపతులకు ఇద్దరు కుమారులు. పెద్ద కుమారుడు సుశ్వత్ (18) స్థానిక దీక్ష జూనియర్ కళాశాలలో ఇంటర్ ద్వితీయ సంవత్సరం చదువుతున్నాడు. తండ్రి ప్రస్తుతం ఆదిలాబాద్‌లో ఆప్తాల్మజిస్ట్‌గా, తల్లి లక్ష్మణచాంద మండలం వెల్మల్- బొప్పారం యూనియన్ బ్యాంకులో మేనేజర్‌గా విధులు నిర్వర్తిస్తున్నారు. సుశ్వత్ బుధవారం బైక్‌పై వెళ్తుండగా రాజరాజేశ్వర గార్డెన్ సమీపంలో మున్సిపల్ ట్రాక్టర్‌ను ఢీకొట్టాడు. దీంతో తలకు బలమైన గాయాలు కావడంతో ప్రభుత్వ బోధనాసుపత్రికి తరలించారు. పరీక్షించిన వైద్యులు అప్పటికే మృతి చెందినట్లు ధ్రువీకరించారు. కుటుంబసభ్యుల ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు జరుపుతున్నట్లు ఎస్సై వివరించారు.

రోడ్డు ప్రమాదంలో యువకుడు మృతి


నిఖిల్ మృతదేహం

లక్ష్మణచాంద(నిర్మల్): మండల కేంద్రానికి చెందిన యువకుడు హైదరాబాద్‌లో జరిగిన రోడ్డు ప్రమాదంలో మృతి చెందాడు. స్థానికులు తెలిపిన వివరాల ప్రకారం మండల కేంద్రానికి చెందిన సిరిపురం ఆనంద్ దంపతులకు కుమారుడు, కుమార్తె సంతానం. కుమారుడు నిఖిల్ (20) ఇటీవల కోచింగ్ కోసమని హైదరాబాద్‌కు వెళ్లాడు. మంగళవారం రాత్రి అక్కడ జరిగిన రోడ్డు ప్రమాదంలో మృతి చెందాడు.

రోడ్డు ప్రమాదంలో గాయపడిన మహిళ మృతి

నందిపేట్: నిజామాబాద్ జిల్లా నందిపేట్ మండలంలోని సీహెచ్ కొండూరు సమీపంలో బైక్ అదుపుతప్పి కింద పడిన ఘటనలో గాయాలపాలైన మహిళ చికిత్స పొందుతూ మృతి చెందినట్లు ఎస్సై రాహుల్ తెలిపారు. ఎస్సై తెలిపిన వివరాల ప్రకారం.. నిర్మల్ జిల్లా ముధోల్ మండలం ఎడ్‌బిడ్ గ్రామానికి చెందిన దూసమూడి రుక్మవ్వ (42) భర్త సాయన్న, కుమారుడు హర్షవర్ధన్‌తో కలిసి బతుకుదెరువు కోసం ఏడేళ్ల క్రితం ఆర్మూర్‌కు వలస వచ్చారు. ఈ నెల 1న భర్తతో కలిసి బైక్‌పై స్వగ్రామానికి వెళ్తుండగా కొండూరు సమీపంలో వాహనం అదుపుతప్పి కిందపడిపోయింది. ఈ ఘటనలో రుక్మవ్వకు తీవ్ర గాయాలుకావడంతో స్థానికులు నిజామాబాద్ ఆస్పత్రికి తరలించగా చికిత్స పొందుతూ బుధవారం మృతి చెందింది. కుటుంబ సభ్యుల ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై పేర్కొన్నారు.

ఆర్టీసీ బస్సు ఢీకొని ఒకరికి తీవ్రగాయాలు


గాయపడిన లస్మారెడ్డి

భైంసారూరల్: భైంసా పట్టణ సమీపంలోని ఎస్ఆర్ఆర్ ఫంక్షన్ హాల్ సమీపంలో ఆర్టీసీ బస్సు ఢీకొని ఒకరికి గాయాలైనట్లు ఎస్సై శ్రీకాంత్ తెలిపారు. మండలంలోని మాటేగాం గ్రామానికి చెందిన లస్మారెడ్డి భైంసా నుంచి మాటేగాంకు ద్విచక్ర వాహనంపై వెళ్తుండగా ఆర్టీసీ బస్సు వెనుకనుంచి ఢీకొట్టడంతో తీవ్రగాయాలపాలయ్యాడు. గమనించిన స్థానికులు చికిత్స నిమిత్తం 108లో భైంసా ఏరియా ఆసుపత్రికి తరలించారు. కుటుంబ సభ్యుల ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు జరుపుతున్నట్లు ఎస్సై వెల్లడించారు.

ట్రిపుల్‌ఐటీ గాడిన పడేనా..?

- దృష్టి సారిస్తున్న ప్రజాప్రతినిధులు
- విద్యార్థుల్లో పెరుగుతున్న ధైర్యం


బాసర ట్రిపుల్‌ఐటీ


బాసర ట్రిపుల్‌ఐటీలో పర్యటిస్తున్న ఎమ్మెల్యే రామారావుపటేల్ (ఫైల్)

భైంసా(ముధోల్): బాసర ట్రిపుల్‌ఐటీలో నెలకొన్న సమస్యలపై ప్రజాప్రతినిధులు దృష్టి సారిస్తున్నారు. సోమవారం ముధోల్ ఎమ్మెల్యే రామారావు పటేల్ ట్రిపుల్‌ఐటీకి వెళ్లి పరిశీలించారు. విద్యార్థులకు ఎదురవుతున్న సమస్యలను అడిగి తెలుసుకున్నారు. విద్యార్థులు అధైర్యపడవద్దని.. అండగా ఉంటామని హామీ ఇచ్చారు. విద్యార్థులు ఉండే వసతిగృహాలు, మరుగుదొడ్లు, స్నానపు గదులను పరిశీలించారు. విద్యార్థులతో మాట్లాడి సమస్యలు తెలుసుకున్నారు.

పెరుగుతున్న ధైర్యం...

ట్రిపుల్‌ఐటీలో కొన్నేళ్లుగా పాతుకుపోయిన కాంట్రాక్టర్లు ఇష్టారాజ్యంగా వ్యవహరిస్తూ విద్యార్థులను ఇబ్బందులకు గురిచేస్తున్నారు. మెస్‌లలో పురుగుల అన్నం పెట్టే పరిస్థితిని మార్చాలని విద్యార్థులు ఎమ్మెల్యేను కోరారు. బాసర ట్రిపుల్‌ఐటీ అధికారులు పెడుతున్న ఆంక్షలు గోప్యత కారణంగా ఏం జరుగుతుందో తెలియక విద్యార్థుల తల్లిదండ్రులు ఆందోళన చెందుతున్నారు. ట్రిపుల్‌ఐటీలో జరుగుతున్న అక్రమాలపై అవసరమైతే విజిలెన్స్‌తో విచారణ చేయిస్తానని ఎమ్మెల్యే రామారావుపటేల్ హామీ ఇచ్చారు. విద్య, వైద్యంపై తాను రాజీపడనన్నారు. ఎమ్మెల్యే పర్యటనతో ట్రిపుల్‌ఐటీ మెస్‌ల నిర్వాహణపైన క్యాంపస్ అధికారులు దృష్టి సారించారు.

16 ఏళ్లుగా నిరీక్షణ...

ఉమ్మడి రాష్ట్రంలో దివంగత సీఎం వైఎస్ రాజశేఖర రెడ్డి 2008లో బాసర, ఇడుపులపాయ, నూజివీడులలో ట్రిపుల్‌ఐటీలను ప్రారంభించారు. రాష్ట్ర విభజన అనంతరం మన రాష్ట్రానికి బాసర ట్రిపుల్‌ఐటీ ఒక్కటే మిగిలింది. ట్రిపుల్‌ఐటీ ప్రారంభంలో 129 మంది కాంట్రాక్టు అధ్యాపకులు, 19 మంది పర్మినెంట్ ప్రొఫెసర్లను ప్రభుత్వం నియమించింది. 16 ఏళ్లుగా వారే పనిచేస్తున్నారు. మరో 70 మంది అధ్యాపకులను గెస్ట్ ఫ్యాకల్టీగా తాత్కాలికంగా నియమించుకున్నారు. మరో 125 మంది ప్రొఫెసర్లు అవసరమని రాష్ట్ర ప్రభుత్వం 2014లో సూచించింది. ఇప్పటికీ ఈ పోస్టుల భర్తీ జరుగలేదు. రాష్ట్ర ప్రభుత్వం అన్ని శాఖల్లో కాంట్రాక్టు ఉద్యోగులను క్రమబద్ధీకరించింది. కానీ యూనివర్సిటీ ఏర్పడినప్పటి నుంచి పనిచేస్తున్న ట్రిపుల్‌ఐటీ కాంట్రాక్టు ఉద్యోగులు క్రమబద్ధీకరణకు నోచుకోవడంలేదు. ఉద్యోగ భద్రత లేకపోవడంతో ప్రత్యామ్నాయ అవకాశాలు వస్తే ఉద్యోగానికి రాజీనామా చేసి వెళ్లి పోతున్నారు. 19 మంది పర్మినెంట్ ప్రొఫెసర్లు ఉంటే ఉన్నత చదువుల పేరిట 12 మంది సెలవులో వెళ్లారు. తాత్కాలిక అధ్యాపకులను నియమించుకుని విద్యాసంవత్సరం వెళ్లదీస్తున్నారు. ఒకవైపు విద్యాబోధన మరోవైపు అదనపు బాధ్యతలతో తీవ్ర పనిఒత్తిడికి గురవుతున్నారు. ఎక్కడ లోపం జరిగినా క్రమశిక్షణ చర్యలకు బాధ్యులవుతామనే భయం ఉద్యోగులను వెంటాడుతోంది. డీన్‌లు, హెడ్ ఆఫ్‌ద డిపార్ట్‌మెంట్, ఎగ్జామినర్, చీఫ్ వార్డెన్, వార్డెన్, స్టూడెంట్ వెల్ఫేర్ ఆఫీసర్ వంటి కీలకమైన బాధ్యతలను అధ్యాపకులకు అప్పజెప్తున్నారు. ట్రిపుల్‌ఐటీలో టీచింగ్, నాన్‌టీచింగ్ ఉద్యోగులు పనిచేస్తున్నారు. క్రమబద్ధీకరణతోపాటు నిబంధనల ప్రకారం వేతనాల పెంపు, ఇతర భత్యాల కోసం ఈ ఉద్యోగులంతా మూడు నెలలకోసారి పోరాటం చేస్తున్నారు.

వసతులు అంతంతే...

ట్రిపుల్‌ఐటీలో వసతులు అంతంత మాత్రంగానే ఉన్నాయి. మరుగుదొడ్ల నిర్వాహణ సరిగాలేదు.నిబంధనల పేరిట అధికారులు ఎవరినీ అనుమతించడంలేదు. క్యాంపస్‌లో ఏంజరిగినా బయటకు పొక్కనివ్వడంలేదు. మెస్‌లలో పురుగుల అన్నం వచ్చినా విద్యార్థులు అలాగే భోజనాలు చేస్తున్నారు. సెక్యూరిటీ సిబ్బందికి తోడు కొంత మంది రిటైర్డ్ ఆర్మీ అధికారులను నియమించుకుని పర్యవేక్షణ బాధ్యతలు అప్పగించారు. విద్యార్థులు తరగతి గదిలో లేదంటే భోజన శాలకు అక్కడి నుంచి నేరుగా హాస్టల్ గదుల్లోకి వెళ్లేలా చర్యలు తీసుకుంటున్నారు. నలుగురు కలిసి మాట్లాడినా విచారణ ఎదుర్కోవాల్సిన పరిస్థితులు నెలకొన్నాయి. విద్యార్థుల ఫోన్‌లు తీసుకుని తనిఖీలు కూడా చేస్తున్నారు. చిన్న చిన్న తప్పిదాలకు సంజాయిషి లెటర్‌లు రాయించుకుంటున్నారు. ఇలాంటి పరిస్థితులు విద్యార్థులపై ఒత్తిడి పెంచుతున్నాయనే అభిప్రాయాలు వ్యక్తమవుతున్నాయి. రెండు, మూడేళ్లుగా ట్రిపుల్‌ఐటీ సమస్యలపై ఆందోళనలు చేసిన విద్యార్థులపై సైతం నిఘా ఉంచినట్లు సమాచారం.

సమస్యలు నా దృష్టికి తీసుకురండి

ట్రిపుల్‌ఐటీ విద్యార్థులకు ఏ సమస్య ఉన్నా నన్ను సంప్రదించవచ్చు. విద్యార్థుల ఇబ్బందులు ధైర్యంగా తెలియజేయవచ్చు. విద్య, వైద్యం విషయంలో రాజీపడలేం. ట్రిపుల్‌ఐటీలో అక్రమాలపై అవసరమైతే విజిలెన్స్ విచారణ చేయిస్తాం. విద్యార్థులకు నాణ్యమైన విద్య అందించడమే మా లక్ష్యం.

– రామారావుపటేల్, ఎమ్మెల్యే, ముధోల్

బడి పిల్లలకు భద్రతేది?


ఆటో డ్రైవర్ సీటు పక్కన ప్రమాదకరంగా కూర్చున్న ఇద్దరు విద్యార్థులు


ప్రమాదకరంగా ఆటోలో కూర్చుని వెళుతున్న విద్యార్థులు

బడి పిల్లలకు భద్రత లేకుండా పోయింది. పరిమితికి మించి ప్రైవేటు బస్సులు, ఆటోల్లో విద్యార్థులను పాఠశాలలకు తీసుకెళ్తున్నా పట్టించుకునేవారే కరువయ్యారు. ఆటో డ్రైవర్ సీటు పక్కన రెండు వైపులా ఇద్దరేసి విద్యార్థులను కూర్చోబెట్టుకొని బడికి తీసుకెళ్తున్నారు. రోడ్డు భద్రత వారోత్సవాల్లో భాగంగా రవాణాశాఖ అధికారులు, ట్రాఫిక్ పోలీసులు, ప్రైవేటు వాహనదారులకు అవగాహన కార్యక్రమాలు నిర్వహించి చేతులు దులుపుకుంటున్నారు. ప్రమాదం జరిగినప్పుడు హడావిడి చేసే అధికారులు ఆ తర్వాత మిన్నకుండి పోతున్నారు. జిల్లా కేంద్రంలో ముఖ్యంగా విద్యార్థులను తరలించే ఆటోలు, ప్రైవేట్ స్కూల్ బస్సుల్లో పరిమితికి మించి తీసుకెళ్తున్నా రవాణా శాఖ అధికారులు మాత్రం ఎలాంటి చర్యలు చేపట్టకపోవడం శోచనీయం.

– సాక్షి ఫొటోగ్రాఫర్, నిర్మల్


శివాజీ చౌరస్తాలో పరిమితికి మించి బడి పిల్లలను కూర్చోబెట్టుకొని వెళ్తున్న ప్రైవేట్ స్కూల్ బస్సు